**కథ**

# ఇంద్రధనుస్సు

**"హలో" తలవంచుకుని నడుస్తున్న హేమ చటుక్కున తలెత్తింది. ఎదురుగా నవ్వుతూ కార్తీక్.**

**ఒక్కక్షణం గుండె కొట్టుకోవడం మానేసినట్లైంది హేమకి.**

**కార్తీక్ నవ్వితే కార్తీక పున్నమిలా ఉంటుంది. ఆరడుగుల ఎత్తు, పచ్చటి శరీర ఛాయ, నొక్కుల జుట్టు, షేవ్ చేసిన నున్నటి చెంపలు, బ్లాక్ కలర్ పేంట్‌కి టక్ చేసిన లేత నీలిరంగు షర్టు. ఏ సినిమా హీరో అయినా దిగదుడుపే అతని ముందు.**

''ఏమిటలా చూస్తున్నారు'' నవ్వుతూ అన్న అతని మాటకి అప్పటివరకూ అతడినే చూస్తున్న హేమ గబుక్కున తలదించుకుంది. తన ప్రవర్తన తనకే సిగ్గనిపించింది.

''మీరు అనుమతిస్తే సాయంత్రం మీతో కొంచెం మాట్లాడాలి'' అభ్యర్థనగా అన్నాడు కార్తీక్.

''నాతోనా'' విశాలమైన కళ్ళని మరింత విశాలం చేస్తూ అన్నది హేమ.

''ఎందుకలా ఆశ్చర్యపోతారు? ఇందులో ఎనిమిదో ప్రపంచ వింత ఏం లేదు. సాయంత్రం ఐదింటికి శివాజీ కేఫ్ దగ్గర వెయిట్ చేస్తూ ఉంటాను'' హేమ జవాబు చెప్పే లోపే బైక్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు కార్తీక్.

కార్తీక్, హేమ ఒకే కాలేజీలో చదువుతున్నారు. కార్తీక్ ఫైనల్ ఇయర్ డిగ్రీ అయితే హేమ- డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది.

కార్తీక్ తండ్రికి రెండు సినిమా హాళ్ళున్నాయి. సిటీ మధ్యలో లంకంత ఇల్లుంది. వాళ్ళింటి పేరు కూడా లక్ష్మి నిలయమే. అంత ఆస్థిపరుడైన కార్తీక్‌కి తనతో మాటలేమిటి? అనుకుంది హేమ.

హేమ తండ్రి రిటైర్డ్ స్కూలు మాస్టారు. హేమకి ఇద్దరు అక్కయ్యలూ ఓ చెల్లీ చివరగా తమ్ముడూ! వంశోద్ధారకుడి కోసం నలుగురు ఆడపిల్లల్ని భూమి మీదకి తీసుకొచ్చారు హేమ తల్లీతండ్రీ!

కార్తీక్- కో అంటే కోటిమంది అమ్మాయిలు క్యూలో నిలబడతారు. అతని చూపులు తమ మీద పడేట్టు చేసుకోడానికి ఎందరో ఆడపిల్లలు అనునిత్యం ప్రయత్నిస్తుంటారు. అతని ఆస్తి, అందం చూసి వెంటపడే వాళ్ళందరినీ వదిలి తనతో పర్సనల్‌గా మాట్లాడతాననడంలో అంతరార్థం ఏమిటో అనుకుంది హేమ. నిశ్చలమైన సరస్సులో రాయి విసిరినట్టుంది ఆమె పరిస్థితి. చిన్నగా మొదలైన నీటి తరంగాలు సరస్సు అంతా వ్యాపించినట్టు ఆమెలో రేగిన అలజడి హేమ మనసంతా అల్లకల్లోలం చేసింది.

''ఏమిటే ఆ పరధ్యానం'' లెక్చరర్ డిక్టేట్ చేస్తున్నా నోట్స్ రాయకుండా ఏదో ఆలోచిస్తున్న హేమని మోచేత్తో పొడుస్తూ చిన్నగా అన్నది పావని.

''ఏం లేదులే'' తన ఊహలకి కళ్ళెం వేస్తూ అన్నది హేమ. ఆ రోజంతా హేమ చదువుపై దృష్టి పెట్టలేకపోయింది.

కాలేజీ అవర్స్ అవగానే గేటు దాటి బయటకు వచ్చింది హేమ. శివాజీ కేఫ్ దగ్గర వెయిట్ చేస్తానన్నాడు కార్తీక్. తను వెళ్ళాలా వద్దా అన్న మీమాంసలో పడింది. అసలు ఏం మాట్లాడాలని పిలిచాడు. మామూలు విషయానికైతే రోడ్డు మీదే చెప్పచ్చు. కొంపతీసి ప్రేమిస్తున్నానంటాడా ఆ ఊహ రాగానే ఉలిక్కిపడింది హేమ. యౌవనారంభంలో ఉన్న అమ్మాయికి 'ప్రేమ', 'పెళ్ళి' అన్న మాటలు ఎన్ని ఇంద్రధనుస్సులు సృష్టిస్తాయో!

అంతరాత్మ వెనక్కి లాగుతున్నా అతడితో మాట్లాడాలనే మనసు ఉవ్విళ్ళూరుతోంది. ఒక్కసారి మాట్లాడితే ఏం పోయిందీ అనిపించింది హేమకి. మెల్లిగా శివాజీ కేఫ్‌కేసి అడుగులు వేసింది.

★ ★ ★

''హమ్మయ్య... మీరు వస్తారో రారో అని ఎంత టెన్షన్ పడ్డానో. రండి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం'' హేమని చూస్తూ అన్నాడు కార్తీక్.

ఇద్దరూ కార్నర్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

''ఇంక తల పైకెత్తి చూడచ్చు. ఇదేమన్నా పెళ్ళి చూపులనుకున్నారా తల వంచుకు కూర్చోడానికి'' అతని మాటల్లో శ్లేష.

హేమ ఇబ్బందిగా తలెత్తింది. అదే ఆకర్షణీయమైన నవ్వుతో కార్తీక్! అచ్చు సినీ హీరో శరత్‌బాబులా నవ్వుతాడు అనిపించింది హేమకి.

''ఏదో మాట్లాడాలన్నారు'' బేరర్ తెచ్చిన కాఫీ సిప్ చేస్తూ అన్నది హేమ.

అప్పటివరకూ నవ్వుతూ ఉన్న కార్తీక్ ఒక్కసారిగా గంభీరంగా మారిపోయాడు. ''చూడండి హేమగారూ అనవసర ఉపోద్ఘాతాలూ, చెప్పాల్సిన విషయాన్ని లాగుతూ, పీకుతూ చెప్పడం నాకిష్టం ఉండదు. అందుకే నా మనసులో మాట మూడు ముక్కల్లో చెప్పేస్తున్నాను. ఐ లవ్ యూ'' ఆ మూడు మాటల్నీ వత్తి పలుకుతూ అన్నాడు కార్తీక్.

''నా అభిప్రాయం చెప్పాను. మీరు నిదానంగా ఆలోచించి నేను మీకు నచ్చానో లేదో చెప్పండి. మా ఆస్తి, అంతస్తూ మీకు తెలిసే వుంటుంది. దాదాపు కోటి రూపాయల ఆస్తికి నేనే వారసుడిని. మీ ఆర్థిక పరిస్థితీ నాకు తెలుసు. కానీ మన ప్రేమకి ఈ ఆస్తీ అంతస్థులు అడ్డురావనే నా అభిప్రాయం. ఇదుగో ఇది నా సెల్‌ఫోన్ నెంబర్. ఇది నా పర్సనల్ నెంబర్ కాబట్టి మీరెప్పుడైనా ఈ నెంబర్‌కి ఫోన్ చేయచ్చు. ఇంక వెడదామా'' చెప్పాల్సిందంతా చెప్పి లేచి నిలుచున్నాడు కార్తీక్.

ఇంకా అయోమయంలోంచి తేరుకోని హేమ మంత్రముగ్ధలా అతని వెనకాలే నడిచి వచ్చింది.

★ ★ ★

ఆ రాత్రి పుస్తకం ముందేసుకు కూర్చుందిగానీ హేమకి ఏదీ తలకెక్కలేదు. అనుక్షణం కార్తీకే గుర్తొస్తున్నాడు. పదిన్నర దాటింది. అమ్మా, నాన్న, తమ్ముడూ, చెల్లీ అందరూ నిద్రపోతున్నారు. హేమకి మాత్రం కార్తీక్ ఆలోచనలు కందిరీగల్లా రొద చేస్తూనే ఉన్నాయి. అసలు కార్తీక్ తనతో మాట్లాడడమే విడ్డూరం! తనలో ఏం ఆకర్షణ ఉందనీ అతడు తనని ప్రేమించానన్నాడూ! మెల్లిగా అద్దం ముందు నిల్చొని తనని పరీక్షగా చూసుకుంది. తన కను ముక్కు తీరు బాగున్నట్టనిపించింది. తన క్లాస్‌మేట్స్ పావనీ, నళినీ, రేఖా... గుర్తొచ్చారు. వాళ్ళందరికన్నా తను బాగున్నట్టు అనిపించింది. విమల బాగుంటుందంటారు అందరూ కానీ దాని అందమంతా అది వేసుకునే ఖరీదైన డ్రస్సులూ, అది వాడే కాస్మెటిక్స్ వల్లే. విమలలో అందం కన్నా ఆకర్షణ ఎక్కువ. తను కూడా విమల లాగా డ్రస్ చేసుకుంటే ఇంకా అందంగా ఉంటుంది. తనది నాచురల్ బ్యూటీ. అందుకేనేమో కార్తీక్ తనని సెలక్ట్ చేసుకున్నాడు. ఇకనుంచి కార్తీక్

కోస మైనా తను అందంగా తయారవ్వాలని నిశ్చయించుకుంది హేమ.

ఆ రాత్రి హేమకి కలత నిద్ర పట్టింది. ఆ నిద్రలోనే ఏవేవో కలలు... పంచరంగుల్లో ఇంద్ర ధనుస్సులా..

★ ★ ★

''అమ్మా శనగపిండి లేదా''

''లేదు అయిపోయింది. ఐనా ఇప్పుడు శనగపిండి ఎందుకూ'' ఆశ్చర్యంగా అంది పార్వతమ్మ.

''ఏం లేదు ఫేస్‌పాక్ వేసుకుందామని'' కొంచెం విసుగ్గా అంది హేమ.


ఈమధ్య చదువుకన్నా అందం మీద ఎక్కువ దృష్టిపెడుతున్న కూతురి ధోరణి కనిపెట్టకపోలేదు పార్వతమ్మ. వయసొస్తున్న పిల్లలు.. గబుక్కున ఏమైనా అంటే మనసు కష్టపెట్టుకుంటారు అనుకుంది పార్వతమ్మ. అందుకే కూతురి ప్రవర్తనని విమర్శించలేదు.

స్నానం చేసి డ్రసప్ అయి అద్దం ముందు నిలుచుంది హేమ. ఇదివరకూ ముఖానికింత పౌడర్ రాసి బొట్టుపెట్టుకొని హడావిడిగా కాలేజీకెళ్ళిపోయేది. ఇపుడు నిదానంగా శ్రద్ధగా తల దువ్వుకొని ముంగురులు నుదుటిమీద పడేలా హెయిర్ స్టైలు మార్చింది.

మంచి ఫేస్ క్రీం కొనుక్కుంటే బాగుండునని పించి తల్లిని ఎలా డబ్బులడగాలా అన్న ఆలోచనతో వంటింటికేసి నడిచింది హేమ.

గ్యాస్ అయిపోయినట్టుంది. వత్తుల కిరోసిన్ స్టవ్ మీద కూర వేయిస్తోంది పార్వతమ్మ. గుమ్మంలో హేమని చూడగానే ''అపుడే కాలేజీ టైమైపోయిందేమిటే ఒక్క క్షణం ఆగు అన్నం వడ్డిస్తాను'' అన్నది.

వెలిసిపోయిన వాయిల్ చీర, నెరసిన జుట్టు..విశ్రాంతి ఎరుగక శ్రమించే తల్లిని చూసినప్పుడల్లా తను బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేసి తల్లిని సుఖపెట్టాలనుకునేది హేమ. కానీ ఇపుడు ఆమె మనసంతా కార్తీక్ చుట్టూ తిరుగుతోంది. ఫెయిర్‌నెస్ క్రీమ్ కొనుక్కోడానికి తల్లిని డబ్బులు ఎలా అడగాలా అని ఆలోచిస్తోంది. వంన



సులో గిల్టీగా అనిపించినా తల్లి నుండి డబ్బులు రాబట్టడానికి అబద్ధం ఆడాలనే నిశ్చయించుకుంది.

''ఏం హేమా ఏం కావాలి తల్లీ'' గుమ్మంలో సందేహంగా నిలబడ్డ హేమని ప్రేమగా చూస్తూ అంది పార్వతమ్మ.

''కొన్ని బుక్స్ కొనుక్కోవాలమ్మా ఓ యాభై రూపాయలు కావాలి'' అన్నది హేమ.

''సర్లే నిన్న సుశీల ఆంటీ వాళ్ళ జాకెట్లు కుట్టాను. ఆ తాలూకు డబ్బులు పెట్టెలో ఉన్నాయి తీసుకో'' వంట పూర్తి చేస్తూ అన్నది పార్వతమ్మ. భర్తకొచ్చే పెన్షను సరిపోక

**ఆదుర్తి బాల**

ఇంటిపని చేసుకుంటూనే మిషను కుట్టి సంపాదిస్తుంది పార్వతమ్మ.

'హమ్మయ్య ఎప్పుడు డబ్బులడిగినా ఎందుకూ, ఏమిటీ అని వంద ఆరాలు తీసే అమ్మ ఈరోజు అడగ్గానే ఇచ్చేసింది' హాయిగా ఊపిరి పీల్చుకుంటూ పెట్టె తీసి తనక్కావల్సిన డబ్బులు తీసుకుంటూ అనుకుంది హేమ. ఆ యాభై సంపాదించడానికి తల్లి పడ్డ శ్రమ ఆమెకా క్షణంలో గుర్తు రాలేదు.

★ ★ ★

''ఏమిటో ఇవాళ స్పెషల్‌గా కనబడుతున్నావు'' హేమనే పరీక్షగా చూస్తూ అన్నది పావని.

''ఇవాళేంఖర్మ ఇక నుంచీ రోజూ స్పెషల్‌గానే కనిపిస్తుంది హేమ. కార్తీక్ గర్ల్ ఫ్రెండంటే సామాన్యంగా ఉంటే ఎలా'' నవ్వుతూనే అన్నా రేఖ కళ్ళల్లో ఈర్ష్య కనిపించింది హేమకి.

'కార్తీక్ గర్ల్ ఫ్రెండేమిటి' ఈ సంగతి వీళ్ళకెలా తెలిసిందా అప్పుడే అనుకుంది హేమ.

''అబ్బా... అలా అమాయకత్వం నటించకు. నిన్న కార్తీక్‌ని ప్రైవేట్‌గా కలిసి మాట్లాడావా లేదా'' ఎక్కడ్నించి వచ్చిందో డిటెక్టివ్‌లా అన్నది నళిని.

''అదృష్టవంతుడిని తంతే బూరెల బుట్టలో పడ్డాట్ట. ఎంతయినా కార్తీక్ నిన్ను మెచ్చాడు. వలచి వచ్చాడు'' హేమ భుజాలు పట్టుకుని ఊపుతూ అన్నది రాధిక.

అందరూ వెళ్ళిపోయాక అప్పటివరకూ మౌనంగా దూరంగా నిలబడ్డ వనజ దగ్గరగా వచ్చింది. ''హేమా జాగ్రత్తగా ఉండు. నాకెందుకో అతడు నిన్ను ప్రేమించాడంటే నమ్మబుద్ధి కావటల్లేదు'' అంది.

''నీ సందేహం నాకర్థమైంది వనజా. అతడికి మా అంతస్తేమిటో తెలుసు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఇదేనేమో. ఎవరిని ఎవరు ఏ విషయంలో ఆకర్షిస్తారో తెలియదు. బహుశా నా విషయంలో కూడా అదే జరిగి ఉంటుంది. నాకే తెలియని ప్రత్యేకత నాలో అతనికి కనపడి ఉండచ్చు''

''హేమా నీ వెల్‌విషర్‌గా ఓ మాట చెప్తున్నాను విను. మనలాంటి మధ్యతరగతి మనుషుల్లో మనకే తెలియని ఓ అభద్రతా భావం ఉంటుంది. క్లాసులో బాగా చదివే స్టూడెంట్ ఓ డల్ స్టూడెంట్‌ని చూసి పలకరింపుగా నవ్వాడనుకో! ఈ డల్

స్టూడెంట్ తన స్థాయి పెరిగిపోయినట్టు గొప్పగా ఫీల్ అయిపోతాడు. కానీ వాస్తవం ఏమిటో తెలుసా బాగా చదివే స్టూడెంట్ ఇంకా బాగా చదివే స్టూడెంట్‌తోనే మాట్లాడాలనుకుంటాడు కానీ డల్ స్టూడెంట్‌తో కలిసి ఉండాలని అనుకోడు. డబ్బు ఉండడం గొప్పతనం కాకపోయినా ప్రస్తుత సమాజంలో డబ్బున్న వాడినే మనం గొప్పవాడనుకుంటాం.

అలాటివాళ్ళు మనతో ఏ కాస్త ప్రేమగా మాట్లాడినా ఏదేదో ఊహించుకొని అదంతా నిజమైన ప్రేమే అనుకుంటాం. కానీ అంత డబ్బున్న వాళ్ళు మనతో ఎందుకు స్నేహం కోరుకుంటారు అనుకోం''

''వనజా ప్లీజ్.. అలా అనకు. ప్రేమ కారణాలు వెదకదు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్''

''నాన్సెన్స్'' హేమ మాటలకి అడ్డు తగులుతూ అంది వనజ. ''నువ్వేమీ అనుకోనంటే ఓ మాట చెప్తా.

నువ్వేమీ రంభవీ, ఊర్వశివీ కాదు. కాస్త బాగుంటావు. కానీ అంత మాత్రానికే కార్తీక్ నిన్ను ప్రేమిస్తానడం ఇంపాజిబుల్.

ఇకపోతే అతడిని నీలో ఆకర్షించిన అంశం నీ మంచితనం, వినయం, విధేయుతా అంటాడేమో కార్తీక్. అలాంటి మాటలు నమ్మకు.

కేవలం మంచితనం చూసి ఓ బీద పిల్లని చేసుకునే మహానుభావులెవరూ ఉండరు ఈ లోకంలో. ఇదంతా చూస్తే నాకొకటి అనిపిస్తోంది''

''ఏమిటది'' కుతూహలంగా అన్నది హేమ.

''ఇదంతా కాలక్షేపం ప్రేమ. కార్తీక్ లాంటి వాళ్ళు ఎంతమంది గర్ల్‌ఫ్రెండ్స్‌ని మెయిన్‌టెయిన్ చేస్తే అంత ప్రిస్టేజ్ ఫీలవుతారు''

''అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్''

''మొదటగా నిన్ను నువ్వు ఆత్మవిమర్శ చేసుకోవడం నేర్చుకో. అది మనల్ని సరైన దారిలో నడిపిస్తుంది. జీవితం అనుభవించడానికే..కానీ అనుకున్నది సాధించాక అనుభవించే జీవితం నిజమైన ఆనందాన్నిస్తుంది. ప్రేమ అద్భుతమైనది. పవిత్రమైనది. కానీ ఆకర్షణ ఇంద్రధనుస్సులాంటిది. అది లేకపోయినా ఉన్నట్టు భ్రమింపచేస్తుంది. కానీ ఆకాశంలో ఇంద్రధనుస్సులాగానే ఆకర్షణ కూడా ఎంతోకాలం ఉండదు. నిజమైన ప్రేమ నిర్మలమైన ఆకాశం లాంటిది. అది భ్రమలు కల్పించదు. జీవితానికి సరిపడా తృప్తినీ, ఆనందాన్ని ఇస్తుంది'' అన్నది వనజ.

''అయితే కార్తీక్‌కి ఏం చెప్పమంటావ్. నా నిర్ణయం కోసం ఎదురుచూస్తానన్నాడు.''

''నో అని చెప్పు'' స్థిరంగా అన్నది వనజ.

''కానీ..''

''వద్దు..కానీలూ, అర్థణాలూ వద్దు. నో అని చూడు నువ్వు కాదంటే ఏ అనర్థాలూ జరగవ్, అతడు ఏ అఘాయిత్యమూ చేసుకోడు''

★ ★ ★

''హేమగారూ! మీరింకా ఏమీ చెప్పలేదు, ఎన్నాళ్ళీ వెయిటింగ్'' నడుస్తున్న హేమ పక్కగా బైక్ ఆపి అన్నాడు కార్తీక్. అతని చేతికున్న వజ్రపుటుంగరం, గోల్డ్ రిస్ట్ వాచ్ సూర్యకాంతిలో మెరుస్తున్నాయి. కానీ చూపుడు వేలుకూ మధ్య వేలుకీ మధ్య కాలుతున్న త్రిబుల్‌ఫైవ్ సిగరెట్. దానినంటి వస్తున్న పొగ.

హేమకేదో అర్థం అయినట్టనిపించింది.

''చూడండీ గీటు పెడితేగానీ బంగారం అసలో నకిలీనో గుర్తించడం కష్టం. ఒక లోహం విషయంలోనే అసలో కాదో పరీక్ష పెడతాం. మరి మనిషి విషయంలో ఇంకా జాగ్రత్త అవసరమేమో! మీకు కోటి రూపాయల ఆస్తి ఉండచ్చు కానీ అంతకన్నా మనిషికి జీవితం విలువైంది కదా.. సారీ..''

కార్తీక్ బాధపడలేదు. తను వలలో వేసుకోడానికి ఇంకెవరైనా దొరుకుతారేమో ట్రై చెయ్యాలి అనుకున్నాడు. కానీ అతనికి తెలీదు ఆకాశంలో కనబడే ఇంద్రధనుస్సు కోసం భ్రమలు పెంచుకునే ఆడపిల్లలు కరువవుతున్నారని.

✤



## చివరికి మిగిలేది

**'ఆర్ట్ ఆఫ్ లివింగ్' కోర్సు నా జీవితాన్నే మార్చేసింది అంటోంది నగ్మా. 'బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకున్న తాను పదేళ్ల క్రితం అనుకోకుండా సినిమాల్లోకొచ్చాను. వివిధ భాషల్లో ఇప్పటివరకూ వందకి పైగా చిత్రాల్లో నటించిన తాను బుల్లితెర కోసం ఓ సీరియల్‌తో దర్శకత్వంలోకి ప్రవేశిస్తున్నాను'అంటోంది నగ్మా. ఇప్పుడామె యోగా, మెడిటేషన్ కోసం సింగపూర్, లండన్, అమెరికాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తోంది. కన్నడ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న నగ్మా రోజులో ఎక్కువ భాగం యోగా, మెడిటేషన్ కోసం కేటాయిస్తూ ప్రశాంతజీవితాన్ని కోరుకుంటోంది. చివరికిమిగిలేది అదేనేమో!**